తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

చిన్నంబావి, ఏప్రిల్ 10 : గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులకు తాగునీటి సమస్యపై ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని తాగునీటి సమస్యపై పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకుసాగుతుందన్నారు. అదేవిధంగా మండలంలోని తాగునీటి సమస్యపై కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని కలెక్టర్‌కు సూచించారు. అనంతరం మండలంలోని పెద్దదగడలో ఉగాది పండుగను పురస్కరించుకొని నిర్వహించిన బండలాగుడు పోటీలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, బీచుపల్లియాదవ్, రంజిత్‌కుమార్, తేజరెడ్డి, సురేందర్‌సింగ్, వెంకటేశ్, బొల్లి కురుమయ్య, నరేశ్‌కుమార్, రాజ్‌కుమార్, హనుమంతురావు, గూడెం సుధాకర్ ఉన్నారు.

తగిన చర్యలు తీసుకోవాలి

పాన్‌గల్, ఏప్రిల్ 10: గ్రామాల్లో తాగు నీటి సమస్య ఏర్పడకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రానికి వచ్చిన మంత్రి తాగునీటి సమస్యపై గ్రామాల వారీగా పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి మండలానికి రూ.64లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నీటిసమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో కొత్తగా బోర్లను వేయించి నీటి సమస్యను తీర్చాలని గ్రామాల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రవికుమార్, హైమావతి, ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు, మాజీ విండో వైస్‌చైర్మన్ ముంత భాస్కర్ యాదవ్, నాయకులు పుల్లారావు, రాము, బ్రహ్మం, నరేందర్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో అయిజ ముందంజ

- మున్సిపాలిటీలో రూ.1.51కోట్ల ఆస్తిపన్ను వసూలు
- 94.96శాతంతో రాష్ట్రంలో ఆరోస్థానం
- ఆస్తిపన్ను చెల్లింపులో ఏప్రిల్ 30వరకు 5శాతం రాయితీ

అయిజ, ఏప్రిల్ 10: అయిజ మున్సిపాలిటీ ఆస్తిపన్ను వసూళ్లలో రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. 2023-24 ఏడాదికిగానూ రూ.1.51కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సత్యబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, బిల్ కలెక్టర్లు ఆస్తిపన్ను బకాయిలున్న ఇండ్ల యజమానులకు అవగాహన కల్పించి పన్నులు చెల్లించేలా అధికారులు చూశారు. 2023-24 ఏడాదికి మున్సిపాలిటీలో 7,848 నివాస గృహాలు, వ్యాపార, ప్రభుత్వ భవన సముదాయాలు ఉండగా, రూ.1.59 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా, మార్చి 31వరకు రూ.1.51కోట్ల ఆస్తిపన్ను వసూలు చేశారు. మొత్తం 94.96 శాతంతో తెలంగాణ రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలువడంతోపాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రెండో స్థానంలో నిలిచింది. మున్సిపల్ అధికారులు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది సమన్వయంతో జనవరి, ఫిబ్రవరి, మార్చినెలల్లో టార్గెట్లు నిర్దేశించి ఆస్తిపన్నులు వసూలు చేయడంతో అయిజ మున్సిపాలిటీ ముందంజలో ఉందని అధికారులు చెబుతున్నారు.

ఐదుశాతం రాయితీ..

2024-25 ఏడాదికి ఆస్తిపన్ను చెల్లింపులో 5శాతం రాయితీతో చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. నిర్దేశించిన మొత్తంలో 5 శాతం రాయితీ మినహా ఆస్తి పన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని అధికారులు

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూలు చేస్తున్న కమిషనర్ సత్యబాబు(ఫైల్)

సూచిస్తున్నారు. ఏప్రిల్ 30వరకు 5శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్ను చెల్లించాలి. 2023-24 ఏడాదికిగానూ 7,848 నివాస గృహాలకుగానూ 383 గృహాలకు 5శాతం రాయితీని సద్వినియోగం చేసుకొని రూ.5.73 లక్షలు చెల్లించారు.

రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు

2023-24 ఏడాది ఆస్తిపన్ను వసూళ్లలో అయిజ మున్సిపాలిటీ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. రూ.1.59 కోట్ల పన్ను వసూళ్లకుగానూ రూ.1.51కోట్లు వసూలు చేసి 94.96 శాతంతో రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలిచాం. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించడంతోనే అయిజ మున్సిపాలిటీ ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. 5శాతం రాయితీని సద్వినియోగం చేసుకునేందుకు పట్టణ ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. పట్టణ ప్రజలు ఈనెల చివరి వరకు ఐదు శాతం సద్వినియోగం చేసుకోవాలి.

- సత్యబాబు, మున్సిపల్ కమిషనర్, అయిజ

ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి, మాజీ ఎంపీ

ఇఫ్తార్ విందులో
మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, రావుల

పెబ్బేరు, ఏప్రిల్ 10 : పెబ్బేరులోని జామ మసీదులో బుధవారం రాత్రి మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. వీరిద్దరు ముస్లింలతో ఉపవాస దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతకు
మాజీ ఎమ్మెల్యే చిట్టెం పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

అమరచింత, ఏప్రిల్ 10: అమరచింత బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్ తల్లి వెంకటేశ్వరమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం స్థానిక బీఆర్ఎస్ నేతలతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజుతో కలిసి వెంకటేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

25 మందిపై కేసు నమోదు

ఉండవెల్లి, ఏప్రిల్ 10 : బండలాగుడు పోటీల నిర్వాహకులు, ఎద్దుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. ఏఎస్సై వివరాల మేరకు మండలంలోని మారమునగాల గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా బుధవారం హన్‌మాన్ యువజన సంఘం అధ్వర్యంలో ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. దీంతో జంతు హింస చట్టం ప్రకారం నిర్వాహకులు నర్సింహా, శివనారాయణ, కురుమూర్తి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఎద్దుల యజమానులు రోశన్న నాయుడు, వెంకట్రామన్‌గౌడ్, కురుమూర్తి, శ్రీరాములు, మునిస్వామి, చిన్న వెంకట్రాముడు, కాటినేని బాలరాజు, కీరన్న, బిచ్చన్న, చిన్న లక్ష్మన్న, కురుమ లక్ష్మన్న, సంజన్న అలాగే బొంకూరులో నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, ఎద్దుల యజమానులు వెంకటేశ్వరరెడ్డి, గోవింద్, ఊశన్న, గారెన్న, చిన్న ఊశన్న, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

ఎర్రవల్లి చౌరస్తా, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం ఎర్రవల్లి మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు పెద్దదిన్నె గ్రామానికి చెందిన బోయ నడిపి పెద్ద నర్సింహ(52), నర్సింహ(50) ద్విచక్రవాహనంపై ఎర్రవల్లి నుంచి పెద్దదిన్నె గ్రామానికి వెళ్తుండగా మునగాల శివారు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో బోయ నడిపి పెద్ద నర్సింహ అక్కడికక్కడే మృతి చెందగా నర్సింహకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ నర్సింహను అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ దవాఖానాకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూల్ దవాఖానకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు మృతి..

పెబ్బేరు, ఏప్రిల్ 10: పెబ్బేరుకు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్సై హరిప్రసాదరెడ్డి కథనం మేరకు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం పులికల్‌కు చెందిన తెలుగు చంద్రశేఖర్ (29) వనపర్తిలో అతడి స్నేహితుడు పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చంద్రశేఖర్‌అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డీటీని కలిసిన గ్రామస్తులు

గట్టు, ఏప్రిల్ 10 : ఈ ఊరి భూమి మాదేనని, కోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులను ఊరు ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసీల్దార్ సీహెచ్ రవికుమార్‌ను గ్రామస్తులు బుధవారం కలిశారు. ఈసందర్భంగా కోర్టు కేసుకు సంబంధించిన పత్రాలతో పాటు ఇంటి అనుమతి పత్రాలు, పన్ను రసీదులను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమతోపాటు తాత ముత్తాతల నుంచి గ్రామంలో నివసిస్తున్నామని, ఈ పరిస్థితుల్లో తమను ఊరు వదలాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఊరును ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేదిలేదని, తమకు న్యాయం చేయాలని వారు డీటీనీ కోరారు.

రూ.3 లక్షల నగదు పట్టివేత

పెబ్బేరు, ఏప్రిల్ 10 : ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా తరలిస్తున్న రూ.3లక్షల నగదును పెబ్బేరు పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కర్నూల్ బైపాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కన్మనూరుకు చెందిన రంజిత్‌కుమార్ ఎలాంటి ఆధారాలు లేకుండా కారులో తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఐఎం నాయకుడు

వడ్డేపల్లి, ఏప్రిల్ 10: మున్సిపాలిటీ పరిధిలోని పేద ముస్లిం కుటుంబాలకు బుధవారం ఎంఐఎం తాలూకా కన్వీనర్ ఖలీముల్లా ఆధ్వరంలో దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తమ వంతు సాయం అందజేయాలని సూచించారు. రంజాన్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన

వనపర్తి టౌన్, ఏప్రిల్ 10 : రంజాన్ పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గోపాల్‌పేట రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పుట్టపాగల మహేశ్ బుధవారం పరిశీలించారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు ఈద్గా వద్ద ఏర్పాట్లు చేశారు. వేసవి దృష్ట్యా ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు టెంట్లను ఏర్పాటు చేసి, పరిసరాలను సిబ్బందితో శుభ్రం చేయించారు.

ఇద్దరికి రెండేండ్ల జైలు శిక్ష

అలంపూర్, ఏప్రిల్ 10 : ఆర్టీసీ కండక్టర్ విధులకు ఆటంకం కల్గించడమే కాకుండా, దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులకు రెండేండ్ల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ అలంపూర్ ఇన్‌చార్జి జడ్జి ఉదయ్‌నాయక్ బుధవారం తీర్పు వెల్లడించారు. 2015లో అలంపూర్ నుంచి కర్నూల్ వెళ్తున్న గద్వాల ఆర్టీసీ డిపో బస్సులో కండక్టర్‌గా విధుల్లో ఉన్న కృష్ణయ్యపై అలంపూర్‌కు చెందిన చాకలి శ్రీనివాసులు, గోపి అనే ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాడి చేశారు. దీంతో అలంపూరు పోలీస్ స్టేషన్‌లో కండక్టర్ ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పర్వతాలు కేసు నమోదు చేశారు. తొమ్మిదేండ్లుగా కేసు విచారణ కాగా ఇప్పుడు తీర్పు వెల్లడైంది.

సభను విజయవంతం చేద్దాం

గద్వాల రూరల్, ఏప్రిల్ 10 : ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 12న నిర్వహించనున్న అంబేద్కర్ ఆలోచన పండుగ సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మాచర్ల ప్రకాశ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కేఎస్ ఫంక్షన్ హాల్ లో సభ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రధాన వక్తగా ప్రొఫెసర్ కాశీం హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అంబేద్కర్ వాదులు దళిత బహుజనులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు మోహన్‌రాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, దాసు, మహేశ్, సుదర్శన్, భీసన్న, నాగరాజు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటికోసం
రూ.5 లక్షల ప్రతిపాదనలు

పాన్‌గల్,ఏప్రిల్10: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం మండలంలోని కేతేపల్లి గ్రామానికి రూ.5లక్షల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా దళితవాడ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో కొత్త బోరు మోటార్ వేసి ట్యాంకులకు కనెక్షన్ ఇచ్చే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. తిప్పిరెడ్డికుంట వాటర్ స్కీం బోరుకు 10హెచ్‌పీ మోటర్ అమర్చి ట్యాంకు కనెక్షన్ ఇచ్చే పనులు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఎండలతో ప్రజల బెంబేలు

గట్టు, ఏప్రిల్ 10 : మండుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోజురోజుకూ ఉష్ణోగ్రత పెరుగుతుండడంతో ప్రజలు దిక్కుతోచని పరిస్థితులతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎండలతో ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. కాగా రైతులు, కూలీలు సైతం పొలం పనులకు ఉదయమే వెళ్లి మధ్యాహ్నం వరకు తిరిగి వస్తున్నారు. ఉపాధిహామీ కూలీలు సైతం పనులకు ఉదయం వేళల్లో మాత్రమే వెళ్తున్నారు. కాగా ఉదయం తొమ్మిది, పది అయ్యిందంటే చాలు ఎండల తీవ్రతలతో రోడ్లు నిర్మానుషంగా మారుతున్నాయి. ఎండల కారణంగా తాగునీటి వినియోగం బాగా పెరిగింది. ఫ్యాన్లు, కూలర్ల ఉపయోగం కూడా చాలా పెరిగింది. ఏప్రిల్‌లోనే ఎండలు ఈవిధంగా ఉంటే మేలో పరిస్థితి ఏమిటని ప్రజలు వాపోతున్నారు.

ఫిర్యాదులపై జవాబుదారీగా ఉండాలి

- గద్వాల ఎస్పీ రితీరాజ్

ధరూరు, ఏప్రిల్ 10 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై డిపార్ట్‌మెంట్ జవాబుదారీగా ఉండాలని ఎస్పీ రితిరాజ్ అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను అదనపు ఎస్పీ గుణశేఖర్‌తో కలిసి ఆమె బుధవారం తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఎస్‌హెచ్‌వో రూమ్, మెన్‌రెస్ట్ రూమ్, లాక్‌అప్ రూమ్‌ను పరిశీలించి శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్సై విజయ్‌కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారులకు రిసిప్ట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సైకి సూచనలు చేస్తున్న ఎస్పీ రితిరాజ్

హోరాహోరీగా కుస్తీ పోటీలు

కుస్తీలో తలపడుతున్న క్రీడాకారులు

అయిజ రూరల్, ఏప్రిల్10 : మండలంలోని చిన్నతాండ్రపాడులో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీలను సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రాముడు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలు స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉమేశ్‌గౌడ్, మహేశ్ నాయుడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

గద్వాల రూరల్, ఏప్రిల్ 10 : మండలంలోని బీరెల్లి గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీను బుధవారం ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎండల్లో తగిన జాగ్రత్తలు పాటించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపారాణి

మల్దకల్, ఏప్రిల్ 10 : రోజు రోజుకూ పెరుగుతున్న ఎండలతో ప్రజలు, రైతు లు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి స్వరూపారాణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. కావున ప్రజలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఇంటి పట్టునే ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లకూడదన్నారు. బయటకు వచ్చినా గొడుగు తప్పనిసరిగా ఉండాలన్నారు. నీరు ఎక్కువగా తాగాలని, అలాగే ఓఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలన్నారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, గుండె జబ్బు గలవారు వడదెబ్బ తగిలే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. వడదెబ్బ తగిలిన వారు వెంటనే దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే 108కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

అయిజ, ఏప్రిల్ 10 : ఎండల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ శివతేజ సూచించారు. బుధవారం మండలంలోని భూంపురం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత వల్ల బయటకు వెళ్లేవారికి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుందన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులను చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లి, శరీరాన్ని ఐస్ లేదా నీటితో తుడవాలన్నారు. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలన్నారు. ఎండకు బయటకు వెళ్లే సమయంలో క్యాప్, గొడుగు తీసుకెళ్లాలన్నారు. రోజుకు ఐదారులీటర్లకు తగ్గకుండా నీరు తాగాలన్నారు. సమయానికి ఆహారం తీసుకోవాలని, వదులైన తెల్లటి దుస్తులు ధరించాలన్నారు. వేసవిలో శీతల పానీయాలు మంచివికాదన్నారు. కొబ్బరి బొండం, మజ్జిగ తాగాలన్నారు. బయటకు వెళ్లే సమయంలో నీటి బాటిల్ తప్పని సరిగా వెంట తీసుకుపోవాలన్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు వెళ్లరాదని సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

పాన్‌గల్, ఏప్రిల్ 10 : మండలంలోని కదిరేపాడు, గురిగింజ మిట్ట తండాలో మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య బుధవారం ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధి కూలీలు, ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున అవసరం ఉంటే తప్పా బయటికి వెళ్లవద్దని, అత్యవసర సమయంలో టోపి, చేతి రుమాలు ధరించి వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వృథాపై పట్టింపేదీ?

కొత్తకోట, ఏప్రిల్ 10: మండలంలోని కనిమెట్ట గ్రామంలోని 7వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ వల్ల నీరు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రత్యేకాధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ కిందిస్థాయి అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా ఉండిపోతున్నారు. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్న మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడంతో వారి పనితీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామంలో పైపులైన్ లీకేజీలను అరికట్టి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనిమెట్టలోని 7వ వార్డులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో వృథాగా పోతున్న తాగునీరు

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- డీఎల్పీవో వెంకట్‌రెడ్డి

మల్దకల్, ఏప్రిల్ 10: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో వెంకట్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని బిజ్వారంలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే రెండు నెలలు ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు. గతంలో తాగు నీటి కోసం వేసిన బోర్లను గుర్తించి వాటిని మరమ్మతు చేయించాలని ఎంపీవోను ఆదేశించారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ప్రతి నిత్యం మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని కార్యదర్శికి సూచించారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ఈయన వెంట ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శులు ఉన్నారు.

పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీఎల్పీవో వెంకట్‌రెడ్డి

పెబ్బేరులో దొంగల హల్‌చల్

- పది దుకాణాల షట్టర్లు తొలగించి చోరీకి యత్నం
- నాలుగు దుకాణాల్లో నగదు, విలువైన వస్తువుల అపహరణ

బాధితులతో వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై హ